కవితా కౌముది

# పండుతాటికల్లు

కృష్ణ మణి

గుల్ఫారం దంచి
లొట్లు నిమ్పిండు గౌండ్ల రాజన్న
అట్ల నింపిండో లేడో
గప్పుడే దిగిన్రు
ఎల్లిగాడు మల్లిగాడు ;
పెడ్లాం పిల్లలను
గాలిదేవునికి గిరివిబెట్టిండు ఎల్లిగాడు
పెండ్లికానక
దుకాన్లనే ముంతతోని సంసారం జేస్తుండు మల్లిగాడు!
మాటలు జూస్తే
మూటలు నిండుతయి
బతికిశెడ్డ దొరలమని
గాలిల కోటలు కడ్తరు సొక్కమైనోళ్ళు
శింపిరి గడ్డం మాశిన బట్టల కశీరు దూలాలు!
ఎల్లిగాని నొసలుకు
సూరెండ గుచ్చితే అర్ధమయ్యింది
అద్దుమరాతిరి ఇల్లు జేరింది
బరిగడుపున తిందామంటే
పెండ్లాం సదువుడికి ఎక్కడలేని రోషం
పిల్లలు జూస్తుండంగ
తల్లి ఈపు అట్టలు దేలినయి !
ముద్దు జెద్దామంటే
గూట్లపిట్టలోలె బెదురుతరు పొరలు
ఎవడు జెప్పిన తిప్పలురా ఎల్లిగా
ఏం బతుకురా నీది
బతికినా సచ్చినా
లెక్కలకు రాని పురుగువి
అని నాయినమ్మ కలకలానవట్టే!

మన్ను మల్లి
సంసారం చింత జెయ్యవట్టే బుద్ధిమంతుడు
అంతల్నే వొచ్చిండు మాయల మల్లిగాడు
ఓ ఎల్లన్నో ... ఏం సుఖమే నీదో
రాతిరి ఒదినే పండనియ్యలేదా ఏందని పరాచకం !
ఎల్లిగాని పెడ్లాం పన్లు పటపటాని కొర్కవట్టింది
జెంగిలి బాడ్కావ్ అనుకుంటా
పెండ్లి జేస్కోని కాలవడరాదురా మల్లిగా
అని ముసలమ్మ సాపెన!
మా అన్నని జూస్తలేమే పెద్ద నాయనమ్మ
ఏగుతుంది సాలదా
ఇంక నాకెందుకే అని
ఎల్లిగాని చెవిల జొర్రీగ గుయ్యిమనట్లు
ఓ ఎల్లన్న
ఎల్లే జల్ది
పండుతాటికల్లు తెచ్చిండు జంగన్న
అని మెల్లంగ గెల్కిండు !
ఇంకేంది నాల్కె జివ్వుమని
ఇంట్ల నిలవదనియ్యద్
దీని బర్రె మొకం ముండది ఇదొకటి నా పానానికని
అంగేసుకుంటా సరసరా ఆకిలి దాటి
ఉయ్యాల ఊగినట్లు ఉర్కవట్టే
సిగ్గు శరం లేనోడు ఏంజెప్పాలె

****



# గుర్తింపు

సబ్బని లక్ష్మీనారాయణ

గుర్తింపు చాలా ముఖ్యం
ఇనుప ముక్కలా గుర్తింప బడాలనుకుంటావో
ఇత్తడిలా గుర్తింప బడాలనుకుంటావో
రాగిలా గుర్తింప బడాలనుకుంటావో
సత్తులా గుర్తింప బడాలనుకుంటావో
నీ ఇష్టం !
దేనికైనా ఓ గుర్తింపు , విలువ ఉపయోగం ఉంటుంది, కాదనను
కానీ నేను బంగారంలా గుర్తింపబడాలనే అంటాను
బంగారం లాంటి మన్నికైన మనిషంటే తిరుగు లేదు
మట్టిలో పూడుకుపోయిన మాణిక్యానికైనా దాని విలువ తరిగిపోతుందా
అడ్డగించిన మేఘాల మాలలతో
ఇనబింబం కనిప్పించకపోతుందా లోకం మొత్తం మీద
సజ్జనుడి జీవితం పూల పరిమళం
సజ్జనుడి జీవితం హిమవన్నగ ఔన్నత్యం
సజ్జనుడి జీవితం మేలిమి బంగారం రూపం
అడ్డ దారిలో పయనించడం ఎందుకు ?
ఇది, అది అందలేదని కలత చెందడం ఎందుకు?
నీకు నువ్వే ఒక ప్రశ్న , నీకు నువ్వే ఒక సమాధానం !
బంగారమే నీకు కొలమానం
బంగారు బతుకుగా రాణించు
బంగారు మనిషిలా జీవించు

★★★★







# నువ్వూ నేనూ

సుధ మెట్టుపల్లి

నీకు సమయం ఉన్నప్పుడు నీవే నా ప్రపంచం అంటావు
నీకు తీరిక లేని వేళ నేను ఎవరో కూడ తెలియనట్లుంటావు,
నన్ను పూర్తిగా మరచిపోయావు అని బాధపడుతున్నవేళ
మెరుపులా నేనున్నానంటూ నా గురించే ఆలోచిస్తావు,
అది నేను గుర్తించి అనందించే లోపే మాయమవుతావు,
నేను నీతో ఉన్నానా అనే సందిగ్ధం
నీవు నాలో ఉన్నావో లేదో అనే సంకోచం
అంతలోనే నీనే నీ సర్వస్వం అనే గుర్తింపు
ఇంతలోనే ఎవరో తెలియదనేంత ఆదమరపు
నీవు నాతో ఉన్నావన్న అలోచనే నా ఊపిరి
అపుడపుడు అయినా నను గుర్తించే నీ ఉనికి నా జీవం
నేనే నీ లోకమన్నది నా కల
నన్ను మరచిపొయవన్నది నా భ్రమ
నీవే నా సర్వస్వమన్నది కలలాంటి నిజం
బాధ్యతలనే మబ్బుల చాటుకు వెళ్తావు
అవి వీడగానే నా చెంతకు వస్తావు
అన్నీ నాకు నచ్చేలా చెయ్యాలంటాను కానీ
చేసినా చెయ్యకపోయినా నీ వెంటే వుంటాను
నా సంతోషానికి కారణం నీ మనస్థత్వం
నేను బాధపడ్డానంటే కారణం నీ పరిస్థితులు
ఎప్పుడైనా ఎక్కడైనా ఎటువంటి పరిస్థితిలోనైనా నీతో ఉండేది నేనే
నీవు నన్ను విడలేవు నేను నిన్ను వీడి పోను
నీవు లేక నేను లేను నేను లేక నువ్వు లేవు
ఎప్పుడూ నీతోనే ఉంటాను కనుకే…
ఉన్నట్లే అనిపించదు కదూ..!
అందుకే అంటారందరూ నన్ను ‘ఓ అంతరాత్మా!’ అని..!!

★★★★

# అనంతం
## శిష్ట్లా.వి.యల్.యన్. శర్మ

ఆకాశం అనంతం
అనుభూతి అనంతం
ఆవేదన అనంతం
ఆనందం అనంతం

కనబడేదంతా
కనుమరుగై పోతుంటే
నీతో.....నీ తోటివాలికి
తోడుగా మిగిలి పోతుంది
అనంతమైన జీవన స్పర్శ......!

అంతమయ్యే జీవితం
పంచిన వెలుగు నీడలు
ఆకాశంలోని చుక్కల్లా
మెరుస్తుంటాయి.....
నీ తర్వాత......!

*****

# చెరసాల
## డా. తంగిరాల మీరా సుబ్రహ్మణ్యం

కదిలే కనురెప్పలు వింజామర వీవెనలు
బెదిరే తనచూపులు కవితల సంభావనలు

ముక్కున మెలిసే ముత్తెపు ముక్కెర
చక్కని చుక్కకు  చ్చాంగు భళా

చెంపల పూసిన మంకెన పూవులు
చెలియ రాసిన వలపు పిలుపులు

పగడపు పెదవుల చిరుచిరు నగవులు
జగడపు చనవుల జాజర తగవులు

కలికి కలల విరుల వరమాల
నీలి కురుల మరుల చెరసాల.

★★★



# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

ఎన్నడో యిటు వచ్చి నా హృదిని నిండి
ఏమెరుంగక కదలిపోయితివి నువ్వు
నిండినట్టి నా హృదియందు నీవు తప్ప
ఇతరులెవ్వరెన్నడు వసియింపలేరు

కరగి కనుమరుగైతివి కలను పోలి
కరగినను నాదు మదివీడి యరుగబోవు
సతము హృదయాన నెలకొన్న స్వప్నమీవు
స్వప్నమైనను చెరగని సత్యమీవు

రాగబంధముల్ వీడి నిద్రాణమైన
ఎద తలుపులను తట్టెదరెవ్వరెవరో
ఇంటిలోనికి పిలువనేమివ్వగలను?
ఎడదనున్నది ప్రేమరాహిత్యమొకటె

కలలలో నిండు కమ్మని కలత యొకటి
కలతలోనిండు కమ్మని కలలవెన్నొ
కలల యనుభూతి మధురమ్ము క్షణికమున్ను
క్షణికమీ జీవితము కూడ స్వప్నమట్లు

క్షణికమైనను తోచు శాశ్వతము వోలె
కరగిపోయెడువరకిది గండశిలయె
సత్యము బ్రతుకు, నేనును సత్యమౌదు
మిథ్య బ్రతుకైన నేనును మిథ్య యౌదు



చిత్రం:కె.రామ్మోహన్